నీటికి నిత్యం తంటాలే!

- మూడు దశాబ్దాలుగా ట్యాంకర్లపైనే ఆధారం
- పనులు మానుకొని ట్యాంకర్ల కోసం పేదల ఎదురు చూపులు
- ఇళ్లకు నీటి కనెక్షన్లు ఏర్పాటుపై అధికారుల తాత్సారం
- సింగరేణి కాలనీలోని గుడిసెవాసుల దుర్భర పరిస్థితి ఇదీ



వాటర్ ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు, చిన్నారులు


కాలనీలో నీటి నిల్వ కోసం డ్రమ్ములు ఏర్పాటు చేసుకున్న గుడిసెవాసులు

సైదాబాద్: హైదరాబాద్ మహా నగరంలోనే అతి పెద్ద మురికివాడల్లో ఒకటైన సింగరేణి కాలనీలోని గుడిసెవాసులు తాగునీటి కోసం నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పదిహేను వేలకు పైగా కుటుంబాలు నివసించే ఈ కాలనీలో అత్యధిక మంది రెక్కాడితే గానీ డొక్కాడని రోజువారీ కూలీలే. అలాంటి వీరు తాగునీటి కోసం పనికి వెళ్లకుండా వాటర్ ట్యాంకర్ల కోసం ఎదురు చూస్తూ ఉండిపోవటం వల్ల ఆ రోజుకు చేతిలో డబ్బులు లేక పస్తులు ఉండాల్సి వస్తోంది. పలు సందర్భాలలో తల్లిదండ్రులు రోజువారీ పనులకు వెళ్తే వారి పిల్లలు స్కూల్‌కు వెళ్లటం మానేసి తాగునీరు పట్టుకోవడానికి ఇంటి వద్దే ఉండి పోవాల్సి వస్తోంది.

- ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో నివసించే వారిలో అత్యధికులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే.
- 30 సంవత్సరాలుగా వారు ఇక్కడి ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. ఇప్పటికీ వారు వాటర్‌వర్క్స్ విభాగం సరఫరా చేసే వాటర్ ట్యాంకర్లపైనే ఆధార పడుతున్నారు.
- సింగరేణి కాలనీలోని గుడిసెవాసుల కోసం 13 ట్యాంకర్లు నిత్యం సుమారు 100 ట్రిప్పులు వేస్తున్నాయి. ముఖ్యంగా వేసవి కాలంలో ఏ ట్యాంకర్ డ్రైవర్ అయినా విధులకు రాక పోతే.. ఆ రోజుకు ఆ ట్యాంకర్ ట్రిప్పులు నిలిచిపోతున్నాయి.
- దాంతో ఆ ట్యాంకర్ కోసం రోజంతా ఎదురు చూస్తూ పలువురు గుడిసెవాసులు ఇబ్బందులు పడుతున్నారు.
- ట్యాంకర్ యజమాని లేదా.. అధికారులు గానీ ఈ విషయంలో ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం గుడిసె వాసులు నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోంది.
- గత ప్రభుత్వాల హయాంలోనే బస్తీలు, మురికివాడల్లోని ప్రజల ఇళ్లకు ఒక్క రూపాయికి వాటర్ కనెక్షన్ పథకం అమలు చేశారు. ఆ పథకాన్ని సింగరేణి కాలనీలో అమలు చేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు.
- సింగరేణి కాలనీలో రహదారులు, డ్రైనేజీలు, వీధిదీపాలు వంటి మౌలివసతులు కల్పించిన అధికారులు.. కాలనీ స్థలం న్యాయ వివాదంలో ఉందని చెప్తూ తాగునీటి కనెక్షన్లు ఇవ్వడంలేదు.
- ఇప్పటికైనా వాటర్‌వర్క్స్ అధికారులు తమకు సరిపడా ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని, సిబ్బంది గైర్హాజరైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సింగరేణి కాలనీలో గుడిసెవాసులు కోరుతున్నారు.
- సింగరేణి కాలనీలోని ఇళ్లకు తాగునీటి కనెక్షన్లు ఏర్పాటు చేసి ఇక్కడి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా...



దశాబ్దాలుగా మంచినీటి కోసం సింగరేణి కాలనీ గుడిసెవాసులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తా. వాటర్‌వర్క్స్ అధికారులు కూడా సింగరేణి కాలనీలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. ట్యాంకర్ డ్రైవర్లు గైర్హాజరైతే గుడిసెవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా దాని యజమాని, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. గుడిసెవాసులకు ఇబ్బంది కలిగిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా. – నాగరిగారి దాస్, ఐఎస్‌సదన్ డివిజన కాంగ్రెస్ అధ్యక్షుడు

నీటి కనెక్షన్లు ఇస్తేనే శాశ్వత పరిష్కారం



నిరుపేదలు నివసించే సింగరేణి కాలనీకి తాగునీటి సదుపాయం కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. సింగరేణి కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడానికి అడ్డురాని న్యాయవివాదం నీటి కనెక్షన్ల ఏర్పాటుకు వస్తోందని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉంది. కాలనీలో ఇంటింటికి మంచినీటి కనెక్షన్లు ఏర్పాటు చేస్తేనే ఇక్కడి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అందు కోసం గుడిసెవాసులతో కలిసి పోరాటం చేస్తాం.
–షేక్ మహమూద్,ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి

కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ నాయకుల చేరిక


కాంగ్రెస్‌లో చేరుతున్న శ్రీధర్‌గౌడ్ తదితరులు

లింగోజిగూడ: డివిజన్ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు, హైదరాబాద్ కమిటీ మాజీ సభ్యుడు కందికంటి శ్రీధర్‌గౌడ్ శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీధర్‌గౌడ్‌కు వారు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీధర్‌గౌడ్‌తో పాటు కుమ్మరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం డైరెక్టర్ బబ్బురి ఆనంద్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ కందికంటి ప్రేంనాథ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


నీటి వృథాను అరికడతామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, కాలనీవాసులు

మన్సూరాబాద్: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టామని జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నాగోలు డివిజన్ రాక్‌టౌన్ కాలనీలో సీడ్ ఎన్జీఓస్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ, వినియోగం, శాంతి కోసం నీరు అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు నీటి వృథాను అరికట్టడంలో సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం నీటి వృథాను అరికడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస్ అధికారి జాల సత్యనారాయణ, సీడ్‌సంస్థ సీఈఓ నాగబ్రహ్మచారి, రాక్‌టౌన్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుల, మతాలకు అతీతంగా సంస్కృతం, వేదాల్లో శిక్షణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దయానంద్ భవన్ సమితి సభ్యులు

మలక్‌పేట: కుల, మతాలకు అతీతంగా విద్యార్థులకు సంస్కృతం, వేదాలతో పాటు సీబీఎస్‌ఈ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నట్లు దయానంద్ భవన్ సమితి అధ్యక్షుడు మ్యాడం సుధాకర్ గుప్తా తెలిపారు. అక్బర్‌బాగ్ దయానంద సరస్వతి మహా విద్యాలయంలో కొత్తగా నిర్మించిన బ్లాక్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, వైదిక ధర్మాన్ని అందరికీ పరిచయం చేయడం కోసం ప్రణవనందా సరస్వతి ఆధ్వర్యంలో ఆర్యసమాజ్ పద్ధతిలో వేద ప్రవచనాలు, రామాయణం, మహాభారతం, ఉపనిషత్తుల బోధన కొనసాగుతుందన్నారు. 65 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని, వారిలో రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఉన్నారన్నారు. దయానంద్ భవన్ సమితి ఏర్పాటు చేసి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫౌండర్ చైర్మన్ కొత్తూరు సీతయ్య నాలుగు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కలుసుకుని ఆట, పాటలతో సందడి చేశారు. మ్యాడం మారయ్య గుప్తా, పెంటమ్మ కుటుంబానికి చెందిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మ్యాడం దయాకర్, శ్రీకాంత్, మదన్‌మోహన్, అశోక్, అశ్విన్, కొత్తూరు జయ ప్రకాశ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

సీఎంకు సుంకోజు కృష్ణమాచారి విజ్ఞప్తి


సీఎంను సన్మానిస్తున్న కృష్ణమాచారి తదితరులు

చంపాపేట: కమ్మరి, వడ్రంగి వృత్తిదారులను ప్రభుత్వమే ఆదుకోవాలని రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ మనుమయ సంఘ అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం కృష్ణమాచారి మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థల వంకతో కులవృత్తిదారులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులలో ఉన్న కమ్మరి, వడ్రంగి కులస్తులకు సబ్సిడీ రుణాలు, ఉచిత కరెంట్ సౌకర్యం, ఆరోగ్య బీమా, యాభై సంవత్సరాలు పైబడిన వారికి పింఛన్ లాంటి సదుపాయాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు కృష్ణమాచారి తెలిపారు. ఈ సందర్భంగా రేవంతరెడ్డిని సంఘ సభ్యులు శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ సభ్యులు కందారం గణేశ్‌చారి, సభ్యులు బాలాచారి, విష్ణుచారి, శ్రీరాములుచారి, రమేశ్‌చారి, వెంకటేశం, అశోక్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యం


సీఎం సహాయనిధి ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


మన్సూరాబాద్ డివిజన్ పరిధి సూర్యోదయ కాలనీకి చెందిన నవీన్ మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఆపరేషన్ చేయించేందుకు ఆర్థిక పరిస్థితి బాగోలేక అతని కుటుంబసభ్యులు ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఆశ్రయించారు. నవీన్ చికిత్స నిమిత్తం ఆయన సీఎం సహాయనిధి నుంచి లక్ష రూపాయలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీని లబ్ధిదారుల కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే శనివారం అందజేశారు. పేదలు నాణ్యమైన వైద్యం పొందేందుకు సీఎం సహాయనిధి దోహదపడుతోందని సుధీర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతుల రాజిరెడ్డి, సాయికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి

హయత్‌నగర్: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా సీడ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ డీజీఎం మాధవి మాట్లాడుతూ... భవిష్యత్ తరాల కోసం నీటిని అందించడం అందరి బాధ్యత అని, నీటి వినియోగంపై నిర్లక్ష్యం తగదని అన్నారు. సీడ్ సంస్థ చీఫ్ నాగబ్రహ్మచారి మాట్లాడుతూ... నీరు సహజంగా లభించే అతి ముఖ్యమైన వనరు అని, దీనిని పొదుపుగా వాడుకోవాలని, నీటి పొదుపుపై మహిళలు ముఖ్య పాత్ర వహించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనాజని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి


భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సామిడి శేఖర్‌రెడ్డి


చింతలకుంటలోని వాసవి శ్రీ నిలయంలో ..

మన్సూరాబాద్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతిని హయత్‌నగర్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని కొత్త పంథాను పట్టించారన్నారు. ముగ్గురు భారత విప్లవానికి నిలువుటద్దమని కొనియాడారు. నూనూగు మీసాల వయస్సులోనే ఉరి కంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు భారత రత్న ప్రకటించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు పోలోజు లక్ష్మణాచారి, వంశవర్ధన్‌రెడ్డి, యనమల్ల శ్రీకాంత్, అరుణ్‌కుమార్‌గౌడ్, దేవేందర్, శోభన్, ఉపేందర్, వెంకటేష్, నాగేశ్వర్ రావు, గణేష్ పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత భగత్‌సింగ్

సాక్షి, సిటీబ్యూరో: ధైర్య సాహసాలు, త్యాగనిరతితో దేశ ప్రజల గుండెల్లో విప్లవ వీరులుగా నిలిచి..నాటి నుంచి నేటి వరకు దేశయువతకు స్ఫూర్తిగా నిలిచిన షహీద్ భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురులు గొప్ప వ్యక్తులని పలువురు వక్తలు పేర్కొన్నారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా చింతలకుంటలోని వాసవి శ్రీ నిలయంలో నరసింహ ప్రసాద్ గొర్రెపాటి ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు వారి జీవిత విశేషాల గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వాసవి శ్రీనిలయం వాసులు కె.భరత్, ఎం.ఎస్.బాలాజీ, పద్మలత, శంకర్, రవి శంకర్, సంజీవరావు, ఎల్లయ్య, రఘునందన్, జగదీష్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం

నాగోలు: తెలంగాణ బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటలకు బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరుగుతాయని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దివంగత నేత పీవీ నరసింహారావుకు భారతరత్న వచ్చిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు, వివిధ రంగాల్లో ఉన్న బ్రాహ్మణ ప్రముఖులకు ఈ కార్యక్రమంలో సత్కారం చేస్తామన్నారు. బ్రాహ్మణ బంధువులు పాల్గొనాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు


సీఎంతో ప్రవీన్ కుమార్

లింగోజిగూడ: ఎల్బీనగర్ ప్రసన్నంజనేయ స్వామి ఆలయం డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రవీన్‌కుమార్ శనివారం జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను శాలువాతో సత్కరించారు. సీఎంను కలిసిన వారిలో పి.శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

సైదాబాద్: ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.ప్రీతం సూచించారు. శనివారం ఆయన నివాసంలో ఆయన జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఐఎస్‌సదన్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరిగారి దాస్ ఆధ్వర్యంలో డివిజన్ పార్టీ నాయకులు ఆయనను కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా మహాసుదర్శన హోమం


పూర్ణాహుతి సమర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి దంపతులు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ డిఫెన్స్ కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శనివారం మహాసుదర్శన హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగ మధుసూదన్‌రెడ్డి దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డం మంగారెడ్డి, డైరెక్టర్లు మల్లికార్జున్‌గుప్తా, సూర్యప్రకాశ్‌గుప్తా, సద్ది సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పట్నం' విజయం ఖాయం: జక్కిడి


ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి విజయం ఖాయమని ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి శనివారం మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని జక్కిడి నివాసానికి విచ్చేశారు. మల్కాజిగిరి అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి గెలుపునకు సహకరించాలని ఆయన కోరారు. జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ ఓట్లు లభించేలా కృషి చేస్తానని, ఎల్బీనగర్ గడ్డ కాంగ్రెస్ పార్టీ అడ్డా అనే విషయాన్ని నిరూపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్ రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి


శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శానిటేషన్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఊడ్చిన చెత్తను వెంటనే తొలగించేందుకు శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై చెత్త ఉంటే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రోజువారీగా కాలనీలో ఊడ్చిన వెంటనే కాలనీ వాసులతో పుస్తకంలో సంతకాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్


లక్ష్మణ్‌రావుగౌడ్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌గౌడ్

మలక్‌పేట: తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మూసారంబాగ్‌కు చెందిన గొట్టిపర్తి శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సలీంనగర్‌లో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ సంఘం ఆశయాలు, లక్ష్యాలను సాధించేందుకు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సుధీర్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదు

ఎల్బీనగర్ నియోకవర్గ కాంగ్రెస్ నాయకులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి పేరుతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మరోసారి పార్టీ మారడానికి సిద్ధమవుతున్నారని, ఆయనను తిరిగి కాంగ్రెస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఎల్బీనగర్ లో శనివారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, మంజులారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎస్టీసెల్ అధ్యక్షుడు రమేష్‌నాయక్ విలేకరులతో మాట్లాడుతూ, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి ఆస్తులు కూడబెట్టడమే సుధీర్‌రెడ్డి లక్ష్యమని, గతంలో కూడా అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీని, ప్రజలను మోసం చేసి బీఆర్‌ఎస్‌లో చేరారని అన్నారు. మరోసారి ప్రజలను మోసం చేసే యోచనలో సుధీర్‌రెడ్డి ఉన్నారని, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఆయన అవసరం లేదని తెలిపారు. నియోజకవర్గంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూర్తి అవగాహన ఉందని, అభివృద్ధికి కావాల్సిన నిధులను తీసుకొచ్చేందుకు మధుయాష్కీగౌడ్, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి లాంటి సీనియర్ నాయకులు ఉన్నారన్నారు. తన స్వలాభం కోసం పార్టీ మారిన సుధీర్‌రెడ్డి రాహుల్‌గాంధీని, రేవంత్‌రెడ్డిని దుర్భాషలాడిన విషయం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరచిపోరని అన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకుడు పన్యాల జైపాల్‌రెడ్డి, నాయకులు రమేష్, పాషా, శివ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులు సత్వరం పూర్తి చేయండి


రాజీవ్‌గాంధీనగర్ ఫేజ్-1లో డ్రైనేజీ సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నూతన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ ఫేజ్ 1-2ల్లో కార్పొరేటర్ పర్యటించారు. ఫేజ్-1 బంజారా బస్తీలో విద్యుత్ లైన్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిసి కార్పొరేటర్ ఆ బస్తీలో పర్యటించారు. అధికారులతో మాట్లాడి విద్యుత్ లైన్ వేయిస్తానని బస్తీవాసులకు హామీ ఇచ్చారు. బస్తీలో నీటి సమస్య పరిష్కారం కోసం జలమండలి అధికారులతో మాట్లాడి నీటి ట్యాంకర్లు పంపించే ఏర్పాట్లు చేస్తామన్నారు. రాజీవ్‌గాంధీ నగర్‌లో నూతన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించిన ఆయన త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు మళ్లీ సమస్య రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు దశరథ్ నాయక్, కిషన్, ఫేజ్- 2 అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి, బిక్షపతి, దుర్గేశ్, బలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై డీసీపీకి వినతి

కొత్తపేట చౌరస్తా నుంచి నాగోలుకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ప్రతి రోజూ ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ శనివారం రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన డీసీపీ కొత్తపేటలో ప్రతి రోజూ ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేలా ట్రాఫిక్ సిబ్బందిని నియమిస్తామని డీసీపీ తెలిపారని కార్పొరేటర్ తెలిపారు.

పేదల ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలని మంత్రికి వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురం డివిజన్ పరిధి ఎన్టీఆర్‌నగర్‌లోని పేదల ఇళ్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ది అర్బన్ హట్స్, స్లమ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ట్విన్ సిటీస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్, ఇతర బస్తీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ, ఎన్టీఆర్‌నగర్‌లో గత 42 ఏళ్లుగా పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ బస్తీలోని సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల క్రమబద్ధీకరణను చేయాలని కోరారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైన ఈ సమస్యను పరిష్కరించాలని పేదలు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బస్తీ వాసులు కొరిమోని మధు మహారాజ్, పదిదే శంకర్, తెల్కర్ పోసన్న తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని 14వ మేజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఎన్నికల ఫలితాలను రిటర్నింగ్ అధికారి ప్రభాకర్ ప్రకటించారు. అధ్యక్షుడిగా బి.భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా ఎ.రవి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కుమార్, కోశాధికారిగా ఈశ్వర్ తోర్పునూరి, జాయింట్ సెక్రెటరీగా బండి నరేష్, లైబ్రరీ సెక్రెటరీగా సతీష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా శివకుమార్, మహిళా ప్రతినిధిగా టి.సరితలు ఎన్నికయ్యారు. అలాగే, కార్యవర్గ సభ్యులుగా జయసుధాదేవి, నాగిరెడ్డి, అడ్డెంకి మాధురి, ఎర్రంబెల్లి మహేందర్‌రెడ్డి, రాజేష్, పోట్లపల్లి యాదయ్య, విఠం సాయికృష్ణ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

శ్మశానవాటికలో వసతులు కల్పించాలని నిరసన


శ్మశానవాటిక వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాదిగ కులస్తులు

మన్సూరాబాద్: మాదిగ శ్మశానవాటికలో వసతులు కల్పించాలని మన్సూరాబాద్ మాదిగ కులస్తులు ఎంజాల రమేష్, ఎంజాల సురేష్, యాదగిరి, చందు, సాయికిరణ్, శివ, సత్యలు డిమాండ్ చేశారు. శ్మశానవాటికలో వసతులు కల్పించే విషయంలో అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని మన్సూరాబాద్ గ్రామ మాదిగ కులస్తులు శనివారం శ్మశానవాటిక వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మన్సూరాబాద్ గ్రామ సర్వే నంబర్ 4,6ల్లో గత కొన్నేళ్లుగా మాదిగ కులస్తుల శ్మశానవాటిక ఉందని, దాని అభివృద్ధికి గతంలో రూ.38 లక్షల నిధులను జీహెచ్‌ఎంసీ మంజూరు చేసిందన్నారు. అయితే, అభివృద్ధి పనులు అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారని అన్నారు. రూ.28 లక్షలతో జీహెచ్‌ఎంసీ వరద కాలువ పైప్‌లైన్ పనులు చేపడుతుంటే తిరిగి అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. శ్మశాన వాటికలో అటవీశాఖ మాత్రమే అభివృద్ధి పనులు చేపడుతుందని, వేరేవారు చేపడితే కేసులు నమోదు చేస్తామని అటవీశాఖ అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలని పలుమార్లు అటవీశాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. మాదిగల శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలని, లేని పక్షంలో మాదిగ కులస్తులంతా ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని అటవీశాఖ అధికారులను హెచ్చరించారు.